బడిబయట పిల్లలను గుర్తించాలి

- నంద్యాల మండల సర్వసభ్య సమావేశంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): మండలంలో బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఈఓ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో మంగళవారం నంద్యాల మండలమీట్ జరిగింది. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు సంబంధిత శాఖలకు సంబంధించిన సమాచారాన్ని చదివి వినిపించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జూన్ రెండోవారంలో పాఠశాలలు పునః ప్రారంభమవుతాయన్నారు. ఆలోపు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు త్వరలో రానున్నాయన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ పొలాలను సారవంతం చేసే ప్రక్రియలో భాగంగా మట్టి నమూనాల సేకరణ ప్రారంభమైందని, ఇప్పటిప 613 శ్యాంపిల్స్‌ను సేకరించామన్నారు. గ్రామాల్లో 1,420 మందిని కౌలు రైతులుగా గుర్తించామని, కౌలు హక్కు పత్రాలు పొందాలంటే వీఆర్‌ఓల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండల గ్రామాలకు 330 క్వింటాళ్ల జీలుగలు మంజూరు అయ్యాయని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవకు ఆధార్‌కార్డు, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాలకు సచివాలయ ఉద్యోగులను కలిసి పరిశీలన చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, పీఆర్‌ఏఈ శంకర్, హౌసింగ్ ఏఈ వాసుదేవుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏస్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు విడుదల చేయండి


డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలని వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గోస్పాడు: ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీపీఎం నాయకులు కరీం సాహెబ్, చెన్నయ్య డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అమానుల్లాకు మంగళవారం సీపీఎం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది ఉపాధి కూలీలకు వేతనాలు అందలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, వీరభద్రయ్య పాల్గొన్నారు

వన్‌టౌన్ పరిధిలో కార్డెన్ సర్చ్


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సోదాల్లో సరైన పత్రాలు లేని 10 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వేకువజామున నుంచి బైటిపేట ప్రాంతంలో అన్ని ఇళ్లలో సోదాలు జరిపామన్నారు. రాత్రి సమయాల్లో అనవసరంగా బయట సంచరించరాదన్నారు.

పీఎం కుసుమ్'కు భూముల పరిశీలన


ఆలమూరులో భూములను పరిశీలిలిస్తున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

పాణ్యం: పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్‌కు సంబంధించి భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మంగళవారం అలమూరు గ్రామ సమీపంలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద ఈ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాన్ని కేటాయించారు. నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది భూములను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం కింద ఏపీఎస్‌పీడీసీఎల్ వారు ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేశారన్నారు.

ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద ఉన్న గోదాములో పని చేసే ఇద్దరు హమాలీలకు గాయాలయ్యాయి. ఎర్రగుంట్లకు చెందిన జమాల్ బాషా, మహమ్మద్ వుశేన్ అనే ఇరువురు తోటి హమాలీలతో కలిసి గోదాములో వడ్ల బస్తాలు మోసేవారు. దిన చర్యలో భాగంగా మంగళవారం గోదాములో వడ్ల బస్తాలు నెట్ వేస్తుండగా ప్రమాదవశాత్తు పై భాగం నుంచి వారిపై ధాన్యం బస్తాలు పడటంతో ఆ ఇరువురికి గాయాలయ్యాయి. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్కై కరాటే బెల్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు అందుకున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సాయిబాబా నగర్‌లో ఉన్న శ్రీశైల హైస్కూల్‌లో జిల్లా స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సిహాన్ సేక్ నూర్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం స్కై కరాటే బెల్ట్ టెస్టు పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గగన్‌కుమార్‌రెడ్డి, నితీష్, అమృతశ్రీ, దన్సికా, అచ్యుత్‌రామ్‌రెడ్డి, దేదీప్యాలు పసుపు బెల్ట్‌లు, సహర్ష, ధార్మిక, అమీర్, నువాన్, సిద్ధార్థ, హేమశ్రీ, రిషికా, అయాన్, నిఖీల్, అతీక్, గౌతమ్, పవన్‌సాయి, అబూబకర్ ఆకుపచ్చ బెల్ట్‌లు, అయాన్‌ఖాన్, అఫ్రీద్‌ఖాన్ అరెంజ్ బెల్ట్‌లు, ఎస్‌ఎండీ అఫాన్, మహిదర్, పవన్ కార్తీక్, జాహ్నవీలు బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. వీరికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహాన్ అరీఫ్ హుసేన్ ప్రశంసా పత్రాలు, బెల్ట్‌లు అందజేశారు.కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా జాఫర్‌నాయక్, అఫ్జర్ హుసేన్ పాల్గొన్నారు

3 ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయి పెంపు

శిరివెళ్ల: మండలంలో 3 ప్రాథమికోన్నత పాఠశాలలను జెడ్పీ ఉన్నత పాఠశాలలుగా స్థాయి పెంచినట్లు ఎంఈఓ శంకరప్రసాదు మంగళవారం తెలిపారు. చెన్నూరు, ఇసుకపల్లె, బోయలకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి ప్రారంభమవుతుందన్నారు. అలాగే మండలంలో 17 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చెందాయన్నారు. శిరివెళ్లలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ బాలుర, బాలికల, రెడ్డిపేట, గోవిందపల్లె మెయిన్, గంగవరం, మహదేవపురం మెయిన్, గుండంపాడు పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు అయ్యాయన్నారు. వీరారెడ్డిపల్లె, కోటపాడు, యర్రగుంట్ల మెయిన్ , స్పెషల్, గుంప్రమాన్‌దిన్నె మెయిన్ పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు అయ్యాయన్నారు. రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాడి నుంచి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు ఉంటాయన్నారు. ఆదర్శ పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉంటారని ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు విద్యను బోధిస్తారన్నారు. మండలానికి అదనంగా 50 మంది టీచర్లు నియామకం జరుగుతుందన్నారు.

తల్లీబిడ్డ వాహనాల డ్రైవర్లు ఆందోళన

గోస్పాడు: తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాల్లో కెప్టెన్లుగా (డ్రైవర్లు) పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి బాల వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ పెద్దాసుపత్రి వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ ప్రస్తుతం అరబిందో (ఏఈఎంఎస్) సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్నామన్నారు. నెలకు కేవలం రూ. 7,870 వేతనం ఇస్తున్నారని, ఈ అరకొర జీతం కూడా మూడు నెలల నుంచి ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో తల్లీబిడ్డ వాహనాల యూనియన్ నాయకులు కిషన్ కుమార్, ఖాజారఫీ, సుభాని, సీఐటీయూ నాయకలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఆంధ్రకేసరి


టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులని నందిరైతు సమాఖ్య గౌరవ సలహాదారు, విశ్రాంత శాస్త్రవేత్త కాదరబాద్ రవీంద్రనాథ్, కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకునేవారన్నారు. తరచుగా ఈ ప్రాంతానికి వచ్చే వారన్నారు. తిరుపతిలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బ్యారేజీ నిర్మాణంలో ప్రకాశం పంతులు పాత్ర ఎనలేనిదన్నారు. సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి ఆంధ్ర కేసరిగా ఆయన గుర్తింపు పొందారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఎదిగిన గొప్ప నేత ప్రకాశం పంతులు అని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు కృష్ణారెడ్డి, నీలంవెంకటేశ్వర్లు, ఓబుళపతి, అవ్వారి శేషఫణి, మాబుబాష, నీలకంఠమాచారి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమిస్తాం


గాంధీచౌక్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వివిధ కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు కార్మికులను, ఉద్యోగులను నయబానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మురళీధర్, శ్రీనివాసులు, గౌస్, నాగరాజు, లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక, వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కులను మోదీ సర్కారు నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. లేబర్ వెల్ఫేర్ బోర్డులను పునరుద్ధరించాలని, బిల్డింగ్ కార్మికులకు సంక్షేమ నిధి జమ చేయాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు హుసేన్, సుబ్బారావు, గోపాల్, జైలాన్, మద్దిలేటి, మహిళా నాయకురాలు సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూముల కౌలుకు వేలం


బీరవోలులో కౌలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: కోటపాడులోని శ్రీచెన్న కేశవస్వామి, వీరభద్ర స్వామి ఆలయాల మాన్యం భూముల కౌలుకు వేలం పాట నిర్వహించారు. ఆయా ఆలయాలకున్న 86.85 ఎకరాలను ఏడాది పాటు కౌలుకు ఇచ్చామన్నారు. గతేడాది రూ. 27.30 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 23.44 లక్షలు వచ్చిందన్నారు. అంటే గతేడాదితో పోల్చితే ఈ సారి ఆదాయం తగ్గిందని గ్రూప్ దేవస్థానాల ఈఓ రామాంజనేయ శర్మ మంగళవారం తెలిపారు.

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలులో దేవదాయశాఖ అధికారులు మంగళవారం వేణుగోపాల స్వామి మాన్యం భూముల కౌలుకు వేలం పాట నిర్వహించారు. 24.23 ఎకరాల భూమి రెండేళ్ల కౌలుకుగాను రూ.3.10 లక్షలు పలికినట్లు ఈఓ రామాంజనేయశర్మ తెలిపారు. గతం కంటే ఈసారి రూ. 27వేలు అధికంగా పలికినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం


బంగారు పతకం అందుకున్న మానసవీణ

నంద్యాల(వ్యవసాయం): మైసూర్ దత్త పీఠాధిపతి, అవధూత గణపతి సచ్చిదానంద స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో నంద్యాలకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మురళీ సతీమణి మానస వీణ బంగారు పథకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ దత్త పీఠంలో నిర్వహించిన ఈ పోటీల్లో భగవద్గీతలోని 18 అధ్యాయాల నుంచి 700 శ్లోకాలు కంఠస్థం చేసినట్లు తెలిపారు. దీంతో తనకు శ్రీగణపతి సచ్చిదానందస్వామి బంగారు మెడల్‌ను, ప్రశంసా పత్రం అందజేశారన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ


మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కాలేజీ, శ్రీరాజరాజేశ్వరి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2, ఏపీపీఎస్‌ఈ అన్ని పోటీ పరీక్షలకు రెండు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫ్యాకల్టీతో సమగ్ర కోర్స్ కవరేజ్, మెటీరియల్‌తో నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 23 నుంచి తేదీన ఎంఎస్ ఆఫీసు, వెబ్‌సైట్ డిజైన్ వంటి కోర్స్‌లు నిర్వహించబడుతాయన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 9985240952 నంబరును సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్‌వసీం

శిరివెళ్ల: సభలలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించకపోతే ఎలా అని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి శాఖ అధికారులు తప్పని సరిగా సమావేశాలకు హాజరు కావాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు పడుతున్నాయా? ఇనుము, సిమెంట్ ఇస్తున్నారా? అని ఏఈ అహమ్మద్‌బాషాను ప్రశ్నించగా ప్రస్తుతానికి లబ్ధిదారులకు సిమెంట్ ఇస్తున్నామని సమాధానం ఇచ్చారు. మండల కేంద్రంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని వేసవి కాలంలో వరి గడ్డి వాహనాలు కాలి పోతున్నాయని ఎంపీటీసీ శ్రీనివాసులు సభ దృష్టికి తెచ్చారు. ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని యర్రగుంట్ల ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి కోరారు. ఇలా పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ పుష్పకుమారి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలయిందని, అర్హులకు ఇళ్ల స్థలాలకు పోజిషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, ఉపాధి పథకం ఏపీఓ రామసుబ్బయ్య, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయండి


శోభాయాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగే వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని నగర అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గురువారం సాయంత్రం 4 గంటలకు టెక్కె మార్కెట్ యార్డ్ నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో శోభాయాత్ర సహ ప్రముఖ్ యర్రగుంట్ల రాంప్రసాద్, వీహెచ్‌పీ నాయకులు పోలేపల్లి సందీప్, కాల్వ శేష సాయి, కమ్మయ్య, మోహన్ కిరణ్, చింతలపల్లె వాసు, హిమ శేఖర్, వెంకటసుబ్బారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

22న వీర హనుమాన్ శోభా యాత్ర

శిరివెళ్ల: ఈ నెల 22వ తేదీన యర్రగుంట్లలో వీర హనుమాన్ శోభా యాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ వైవీ రామయ్య అన్నారు. మంగళవారం శోభాయాత్ర నిర్వహణపై కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బజరంగదళ్, శ్రీరామ సేన సహకారంతో చేపట్టే శోభా యాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు వస్తారన్నారు.




పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామాల నుంచి తేరుబండి, బోనాలతో తరలివస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు


పెద్దయమ్మనూరులో చౌడేశ్వరి దేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో తిరునాలను పురస్కరించుకుని చౌడేశ్వరిదేవి, అంకాలమ్మ, గంగమ్మ తల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ ఆనవాయితీ ప్రకారం కొండుపల్లె గ్రామం నుంచి తేరుబండి, బోనాలతో వచ్చారు. తర్వాత పెద్దయమ్మనూరువాసులతో కలిసి మంగళవాయిద్యాలతో ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఈసారి పంటలు బాగా పండాలని, రెండు గ్రామాల ప్రజలు ప్రశాంతంగా జీవనం కొనసాగించాలని మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాల సందర్భంగా ప్రతి ఇంటికి బంధువులు, స్నేహితులు రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ, సంజామల, దొర్నిపాడు, శిరివెళ్ల, రేవనూరు ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.











